# అవకాశవాది

"సార్! నాకు వచ్చే నెల ఓ ఇరవై రోజులు సెలవు కావాలి. సార్!" రామ్మూర్తి చేతులు కట్టుకుని అడిగాడు.

ఆఫీసర్ రంగనాధరావు కోపంగా చూశాడు అతని వంక.

"ట్రాన్స్‌ఫర్ అయి వచ్చి నువ్వు చేరి ఓ నెల కూడా కాలేదు. అప్పుడే లీవు కావాలా? వీల్లేదు." కఠినంగా అన్నాడు.

"అలా అంటే కష్టం సార్... నాకు పెళ్ళి ఆగిపోతుంది." వినయంగా బ్రతిమాలుతూ అన్నాడు.

"వ్వాట్ నీకు పెళ్ళా? ఎప్పుడు?"

"అవున్సార్. వచ్చే నెల."

"నాకు చెప్పనేలేదే ...ఎప్పుడు అమ్మాయిని చూశావు? ఎప్పుడు నిశ్చయపరచుకున్నావ్?"

"కర్నూలుకు రాకముందే చూశాను సార్. అది ఈమధ్యేఖాయమైంది".

"అరెరె! నాతో ఒక్క మాటకూడా చెప్పలేదే!" బాధగా అన్నాడు రంగనాధరావు.

ఆయన ఎందుకు బాధపడుతున్నాడో రామ్మూర్తికి అర్థం కాలేదు. ఇంకా పెళ్ళి అంటే సంతోషిస్తాడనుకున్నాడు.

"వెరీ బ్యాడ్...ఫిక్స్ చేసుకునేముందు నాతో చెప్పద్దుటయ్యా! మీ కులం వాణ్ని నేనిక్కడున్నానని తెల్సుగా... ఒక్కమాట చెప్పి వుంటే..."

"సారీ సార్!"

"అస్సలు నీకు మా బంధువులమ్మాయి నిచ్చి పెళ్ళి చేద్దామనుకున్నాను... చాలా బావుంటుంది కూడా..."

"నాకా అదృష్టం లేదు సార్!"

"అబ్బే ఆ అమ్మాయిని చేసుకుంటే నీకు మంచి భవిష్యత్తువుండేది...తొందరగా ప్రమోషన్లు కూడా యిప్పించేవాడ్ని! ప్చ్!" పెదవి విర్చాడు.

రామ్మూర్తికి నిజంగా తాను చాలా నష్టపోయినట్లు అనిపించింది.

"నీ కాబోయే ఆవిడ ఏం చేస్తున్నది?"

"ఏం చెయ్యడం లేదు సార్– టెన్త్ పాసైంది."

"వ్వాట్! మా సీత గ్రాడ్యుయేట్! కట్నం ఎంత?"

"అబ్బే ఏంలేదు లేండి...ఏదో పెళ్ళి ఖర్చుకని యిస్తున్నారు. నాకాబోయే మామ టీచర్‌గా చేసి రిటైర్ అయ్యారు. వున్నదంతా యిస్తున్నామన్నారు."

"నాతో చెప్పడానికి సిగ్గేంటోయ్ – చెప్పు ఎంత?"

"ఓ యిరవైవేలు ... లాంఛనాలు అన్నీ దానిలోనే".

"వ్వాట్! ట్వంటీ...మా సీతపేరు మీదే ముప్పైవేలు నెట్ క్యాష్ వుంది... ఆ పైన లాంఛనాలు అవీ మామూలే అనుకో...ప్చ్! బంగారంలాంటి ఉద్యోగం చేస్తూ మోసపోయావు. ఇంత చీప్‌గా కొట్టేశాడోయ్ మంచి ఛాన్సు మీ మామ"... బాగా విచారం ప్రకటించాడు.

"అంతా మా నాన్న యిష్టమే సార్! నేనెంత చెప్పినా వినలేదు... ఆయన పాత కాలం మనిషి." బాధపడ్డాడు రామ్మూర్తి.

"రామ్మూర్తి! నీకు ఈ సంబంధం యిష్టం లేకపోతే.... వదులుకోరాదు." నిదానంగా అన్నాడు ఆలోచిస్తూ.

"తాంబూలాలు పుచ్చుకున్నాం... అంతా అయి పోయింది."

"నీ మొహం... ఏమైపోయింది...పీటలమీద పెళ్ళిళ్ళేఆగిపోతున్నాయి... ఇల్లు అలకగానే పండుగవుతుందా?"

"కాని... మాది మంచి సాంప్రదాయ కుటుంబం సార్..."

"వల్లకాడు...నిన్ను ఆతగాడెవరో బుట్టలో వేశాడు...ఆ అమ్మాయి ఏమన్నా కలిపి యిచ్చిందోయ్ - పెళ్ళి చూపుల్లో."

"మీరు మీ సీత గురించి కొన్ని రోజులుముందు చెప్పి వుంటే బాగుండేది...మేం మాట యిచ్చే వాళ్ళం కాదు...సంబంధం నిశ్చయం చేసుకునేవాళ్ళంకాదు".

"నేను నీ మేలుకోరి ఓ మాట చెబుతా- వింటావ్."

"చెప్పండి".

"అది కాన్సిల్ చేసుకుని మా సీతను చేసుకో".

"సార్! అది పద్ధతికాదు...నలుగురూ నవ్వుతారు".

"పోనీ! ఓ పనిచెయ్యి - కట్నం ఎక్కువడుగు".

"అది! కూడా ముందే మాట్లాడేశాం సార్ తీసుకున్నాం కూడా".

"పోవయ్యా - పోనీ లాంఛనాల క్రింద స్కూటర్ కావాలని అడుగు. ఆయన యివ్వగలడా?"

"లేదు సార్...బీదవాళ్ళు - ముందే చెప్పారు వాళ్ళు వాళ్ళ దగ్గర యింకేం లేదని".

"ఇంకేం... ఈ సంబంధం వదులుకుంటారు తాము తూగలేమని చెప్పి- అప్పుడు సీతను..."

"ఇదికూడా అంత బావుండదు సార్! కానీ మ్యావాళ్ళు కట్నం తక్కువని ఫీలవుతున్నారు కాబట్టి ఈ పని చెయ్యచ్చు - ఈ రోజే ఉత్తరం రాసి పడేస్తా.రామ్మూర్తి అన్నాడు.

రంగనాధరావు తృప్తిగా నవ్వుకున్నాడు. తను జాలిపడితే సీతకు పెళ్ళి కాదు.తనకింద పనిచేసేవాడికిచ్చి కూడా తను పెళ్ళి చేయలేకపోతే యింక బయటనించి వరుడ్ని ఎలా తేగలడు?

ఆ సాయంత్రమే సీతను చూపించాడు.

రామ్మూర్తికి సీత నచ్చింది. పైగా గ్రాడ్యుయేట్...కట్నం గురించి ముందే చెప్పాడు ఆఫీసర్...అంతే గాక ప్రమోషన్లు తొందరగా వస్తాయి. నోటి మాటతో అంగీకారం తెలిపాడు.

పై ఆఫీసునుండి రామ్మూర్తికి ట్రైనింగ్ ఆర్డర్లు వచ్చాయి. ఓ పదిహేను రోజులు ట్రైనింగ్ హెడ్డాఫీసులో. అతను వెళ్ళిపోవాల్సి రావడంతో సీత పెళ్ళి విషయాలు తాత్కాలికంగా వాయిదా వేయాల్సి వచ్చింది.

కొన్ని రోజులు తర్వాత...

ఓ రోజు రంగనాధరావును రోడ్డుమీద వున్న ఓ గుంపుఆకర్షించింది కారును పక్కగా ఆపి అక్కడికి వెళ్ళాడు.

ఓ ముసలాయన చినిగిన బట్టలతో వున్నాడు. కానీ అతని దగ్గర అద్భుత ప్రతిభ వుంది. రంగు రంగుల చాక్‌పీసులతో వెంకటేశ్వరస్వామి బొమ్మ గీసాడు. ప్రేక్షకులు అతని కళకు అబ్బురపడి డబ్బులు విసురుతున్నారు.

ఆ ప్రయత్నంగా రంగనాధరావు జేబులో చెయ్యిపెట్టాడు. అయిదు రూపాయిల కాగితం తగిలింది. నిరక్ష్యంగా దాన్ని విసిరేసాడు అందరూ చూస్తుండగా.

అందరి కళ్ళల్లో ప్రశంస ... అతని కళాభిరుచికీ.

మర్నాడు యింకో సెంటర్లో ఆ వృద్ధ కళాకారుడు శిలువ ఎక్కిన క్రిస్తు బొమ్మ దగ్గర కూర్చుని వుండటం గమనించాడు. కారాపి అతని దగ్గరికి వెళ్ళి ఆ బొమ్మను నిశితంగా పరిశీలించాడు. ఆ బొమ్మల్లో జీవం కనిపించాయి. జేబులోంచి చిల్లర తీసి విసిరేసాడు.

అతను వంగి దండం పెట్టాడు.

ఇంకో రోజు ఆంజనేయస్వామితో అలరించాడు.

"నువ్వు బొమ్మలు బాగా వేస్తావోయ్!" మెచ్చుకున్నాడు. రంగనాధరావు అతనితో.

"మీ దయ!" అతను ముక్తసరిగా అన్నాడు.

"కానీ దేవుడి బొమ్మలు యిలా రోడ్డు మీద వేస్తే కళ్ళు పోవు ?" రంగనాధరావు ప్రశ్న "అందరూ తొక్కుకుంటూ పోతారు."

"కానీ దేవుడులేంది ఎక్కడ?" అతను అని నేలమీద డబ్బులు ఏరుకోసాగాడు.

"నిన్నెప్పుడు చూసినట్టులేదు...ఎప్పటి నుంచి యిలా వేస్తున్నావ్?"

"అవును బాబు – ఇది నాకిష్టంకూడా లేదు. యాచన చేయకూడదని చెప్పిన నోటితోనే యాచిస్తున్నాను. అడుక్కోకూడదని చేతులు విరగొట్టిన చేతుల్తో అడుక్కుంటున్నాను. కళ అమ్ముకోవడం కోసం కాదు అని ఒకప్పుడు చెప్పినవాడ్ని కళను రోడ్లపాలు చేశాను." కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

రంగనాధరావు మొహం చిట్లించాడు అతను అలా ఉపన్యాసం యివ్వడం నచ్చలేదు.

"మరి అన్నీ తెల్సి ఎందుకిలా అడుక్కుంటున్నావ్?"

"నాకర్మ అలా కాలింది బాబు... గుండెల మీద కుంపటి దించుకోవాలి... అందుకోసం డబ్బులు ఎక్కువపడితే..." అవమానంగా తలవంచుకొని చెప్పాడు.

"హూ! మీక్కూడా...యిలా పెళ్ళి ఖర్చులుంటాయా?"

"ఎందుకుండవు బాబు! ఏ కులంలో పుట్టినా– ఏ మతంలో పుట్టినా ఆడపిల్ల పెళ్ళి ఖర్చుతో కూడుకున్నదే బాబు. పూర్వ జన్మలో అప్పులు చేసి తీర్చలేక చచ్చిపోతే...ఈ జన్మలో కాళ్ళు కడిగి కన్యాదానం చేసి ఆ రుణం తీర్చుకుంటామని మా అమ్మ అంటూ వుండేది." అతను భారంగా అన్నాడు.

"చూడు వరకట్న చట్టం గురించి నీకు తెల్సోలేదో.. అడిగినవాడిపైన ఓ చిన్న ఫిర్యాదివ్వు– మిగతాది వాళ్ళు చూసుకుంటారు." రంగనాధరావు నవ్వుతూ అన్నాడు.

గుంపు నవ్వింది. అతను ఏడవలేక నవ్వాడు.

రామ్మూర్తి రావడానికి ఓ వారం ఎక్కువ పట్టింది.

రాంగానే అతన్ని ఛేంబర్‌లోకి పిలిపించాడు.

"ఏవోయ్! ఏమైంది నీ పెళ్ళి."

"థాంక్స్‌సార్! మీమూలంగా నాకు ఓ పదివేలు ఎక్కువ వస్తున్నాయ్!" కృతజ్ఞతాపూర్వకంగా అన్నాడు.

"వ్వాట్!"

"అవున్సార్! మా మామ వాళ్ళు ఇంకో పదివేలు కట్నం యివ్వడానికి ఒప్పుకున్నారు. కానీ దానికోసం వాళ్ళు చాలా చాలా కష్టపడాల్సి వచ్చిందట."

రంగనాధరావుకు నిరాశ, నిస్పృహ కలిగాయి.

"అదేంటి...వాళ్ళు బీదవాళ్ళు యివ్వలేరన్నావ్?"

"ఏమో సార్! మా మామ డు అర్డైలాగా వెంటపడ్డాడు. ఇస్తానని ఒప్పుకున్నాడు. నాది పోతే ఇంకోటి దొరకదని ఏడ్చారు. ఇంక మా వాళ్ళు కాదనలేక పోయారు."

"కొంపదీసి తీసుకున్నారా?"

"ఆ(! మొన్న తెచ్చిచ్చాడు సార్."

"ఛ!ఛ! ప్లాన్ నాశనం అయిపోయింది."

"పోన్లెండి సార్... రాసి పెట్టి వున్నట్లు జరుగుతున్నది." రంగనాధరావు అవమానం దిగమింగలేకపోతున్నాడు.

"నువ్వామ్మాయిని యిష్టపడ్డావా?"

"ఎవరిని...రాధనా సార్?"

"ఆ(! ఆ అమ్మాయి పేరు రాధా?"

"అవున్సార్.... అప్పటికి సీతను చూడలేదు. బాగానే వుందనిపించింది."

రంగనాధరావు హఠాత్తుగా సీట్లోంచి లేచి అతని దగ్గరికి వచ్చాడు. రామ్మూర్తి భయంగా చూశాడు.

గబుక్కున అతని రెండు చేతులు పట్టుకున్నాడు. "రామ్మూర్తి! ఇవి చేతులుకావు. కాళ్ళనుకో.... నువ్వు సీతను చేసుకో పోతే నామొహం నా భార్యకు చూపించలేను. సీత నా భార్యకు దగ్గరి చుట్టం. నిన్ను నమ్ముకొని ఆమె మాట కూడా యిచ్చేసింది. ఇప్పుడు కాదంటే ఎలా?"

"కానీ పరిస్థితి చెయ్యి దాటి పోయింది సార్. మా వాళ్ళు కట్నం కూడా వాడేశారు అప్పులు తీర్చడానికి."

"ఓస్ అదేనా – నీ సమస్య – మేం యిస్తాంగా కట్నం– దాంతో వాళ్ళ కట్నం వెనక్కివ్వచ్చు." తేలిగ్గా అన్నాడు.

"కానీ మా అమ్మా నాన్నలు ఒప్పుకోరు సార్...లగ్నపత్రిక కూడా రాయించారు వాళ్ళు...ఇంకో పదిరోజుల్లో నాకు రాధకు పెళ్ళి, మీరు తప్పకుండా రావాలి." రామ్మూర్తి చెప్పాడు.

"నీ పెళ్ళి నీ యిష్టమా? మీ అమ్మా నాన్నల యిష్టమా? ఆ మాట చెప్పడానికి సిగ్గులేదు. కాపురం చేసేది నువ్వావాళ్ళా?" గర్జించాడు రౌద్రంగా రంగనాధరావు.

"అయితే నన్నిప్పుడేం చెయ్యమంటారు." భయపడుతూ అడిగాడు రామ్మూర్తి.

"గుట్టుచప్పుడు కాకుండా సీతను పెళ్ళి చేసుకో."

"కానీ మా అమ్మా నాన్నా..."

"ష్! వాళ్ళకు తెలియాల్సిన అవసరం ఏముంది?"

"అంటే సార్...వాళ్ళు..."

"తెలుస్తుంది... కాని ఇప్పుడు కాదు... తర్వాత పెళ్ళయిం తర్వాత తెలుస్తుంది. అప్పుడేం చేస్తారు? ఏం చెయ్యగలరు? మేమంతా లేమా?" ధైర్యంచెప్పాడు.

"కానీ... నా కేదో భయంగా వుంది సార్."

"ధైర్యం చెయ్యకపోతే జీవితంలో పైకి రాలేవు!"

"మరి రాధకేం చెప్పను!"

"నీ మొహం! రాధ సంగతి నీ కెందుకు. నువ్వు సీతను పెళ్ళాడిం తర్వాత మీ వాళ్ళకు ఆ కట్నం డబ్బులిచ్చి రాధ తండ్రికి సారీ చెప్పి రమ్మను - దట్సాల్." తేలిగ్గా చెప్పేసాడు.

"పాపం! రాధ ఎన్నో ఆశలు పెట్టుకుంది సార్!" బాధగా చెప్పాడు.

"ఎందుకు పెట్టుకోదు. చీప్‌గా వస్తే ఏవరైనా పెట్టుకుంటారు. అసలు నీకేం తక్కువోయ్ ఆ సంబంధం చేసుకోడానికి? రూపం తక్కువా? చదువు తక్కువా? ఉద్యోగం తక్కువా? రెండేళ్ళల్లో ఆఫీసరవుతావు. తరవాత విచారపడితే సీత లాంటి సంబంధం వస్తుందా?"

అంతే! ఆ తర్వాత కార్యక్రమాలు చకచకా జరిగిపోయాయి. ఓ మూడు రోజుల్లో సీతకు రామ్మూర్తి కి గుళ్ళో పెళ్ళి జరిగిపోయింది. పెళ్ళికి సీత తరపు బంధువులుచాలామంది వచ్చారు. ఆఫీసుస్టాఫు తప్పించి రామ్మూర్తి వైపు ఎవరూ రాలేదు. అయినా అతను బాధపడలేదు.

"సార్! ఆడబ్బు యిస్తే ...రాధ కట్నం రాధకిమ్మని పంపించేస్తాను." పెళ్ళయిన తర్వాత అన్నాడు రామ్మూర్తి.

రంగనాధరావు నవ్వాడు.

"ఏమిటోయ్ ఆ తొందర? ఇప్పుడు వెధవాలోచనలెందుకు? నువ్వు శోభనం పెళ్లికొడుకువి బంగారుబొమ్మలాంటి సీత దొరికింది. చిలకా గోరింకల్లాగా ముందు హనీమూన్‌కు వెళ్ళిరండి.... తర్వాత ఆ పని చేద్దాం."

"బావుండదుసార్ తెలిసి ఒక తప్పు చేశాన్ను మళ్ళీ అందులో ఆలస్యం కూడాఅయితే."

"ష్! సీత వింటే బాధపడుతుంది. మీది ఆదర్శ వివాహమనుకుంటున్నది. నువ్వు ఆమెను కానీ కట్నం లేకుండా చేసుకున్నావని గర్వపడుతున్నది. ఇప్పుడు నువ్వు ఆమె అకౌంట్‌లోంచి డబ్బు విత్ డ్రా చేసేస్తే నీ విలువ పడిపోతుంది. అందుకే ముందు ఆమెతో హనీమూన్‌కు వెళ్ళిరా... సమయం చూసి అంతా చెప్పు. అప్పటిదాకా ఓపికపట్టు." రంగనాధరావు చెప్పి వెళ్ళిపోయాడు.

రామ్మూర్తికి ఏడుపు వచ్చింది.

తను అనవసరంగా అడకత్తెరలో పోకచెక్క పరిస్థితుల్లో చిక్కుకున్నాడు.

ఈ పెళ్ళితో తనవాళ్ళకు దూరమయ్యాడు.

బంధువుల్లో - పెద్దమనుషుల్లో తమ మాటకు విలువపోయింది.

ఒకటా రెండా మొత్తం ముప్పై వేలు అడ్వాన్సు రాధ వాళ్ళ నాయన దగ్గర నుండి తనవాళ్ళు తీసుకున్నారు. అది తిరిగిచ్చేస్తే కానీ నలుగురిలో తలెత్తుకు తిరగలేడు.

వీలైనంత తొందరలో సీతకు పరిస్థితి వివరించి ఆ డబ్బు వాళ్ళ మొహాన పడెయ్యాలి.

రామ్మూర్తి సీత హనీమూన్‌కు వెళ్ళారు. ఊటీ, బెంగుళూరు, మద్రాసు, మైసూర్ ప్రాంతాలు తిరిగి వచ్చే సరికి పదిరోజులు పైన పట్టింది.

రంగనాధరావు సీత, రామ్మూర్తిలను స్టేషన్ నుండి కార్లో యింటికి తీసుకువస్తున్నాడు. వాళ్ళ

హనీమూన్ ట్రిప్ జయప్రదంగా ముగిసింది.

రంగనాథరావు—

రోడ్డు మీద గుంపును చూసి కారాపాడు.

ఇప్పుడే వస్తానని చెప్పి గుంపుదగ్గరికి వెళ్ళాడు.

రామ్మూర్తి ఆ అవకాశాన్ని వినియోగించుకుంటూ సీతను దగ్గరికి తీసుకున్నాడు మధురమైన మాటలు చెప్పడానికి.

అతను... ఆ ముసిలాడు- కళ్ళెంబడ నీళ్ళు...రోడ్డుమీద ఓ స్త్రీ బొమ్మ... చాలా అందంగా వుంది... మంచి యవ్వనంలో వున్నట్టుంది...కళ్ళలో మంచి కాంతి వుంది.

అతను రంగనాథరావును చూసి సెల్యూట్ కొట్టాడు.

"బాగుందోయ్ బొమ్మ...ఇదిగో అయిదు. అదేంటి దేవుళ్ళను వదిలేసి ఈ బొమ్మ వేశావు? ఎవరు ఈమె?"

ఎగతాళిగా అడిగాడు. "సిన్మా హీరోయినా?"

అతను ఏడ్పును ఆపుకున్నాడు.

"ఓయ్ ముసిలాడా! ఇప్పటికైనా మించి పోయిందేంలేదు...ఎక్కడున్నా ఆర్టిస్టుగా చేరి డబ్బు సంపాదించు...ఈ యాచన బ్రతుకు మానేసి." సలహా యిచ్చాడు.

"ఇంకెవరి కోసం చెయ్యాలి బాబు! నాబిడ్డ వెళ్ళిపోయింది!" ఏడుస్తూ అన్నాడు.

"ఆ(! అప్పుడే గుండెలమీద కుంపటి దించేసుకున్నావా? పెళ్ళిచేసి పంపించావా?" హాస్యంగా అన్నాడు.

"ఆ(! వల్లకాటికి పంపించాను పాడెకట్టి. అగ్నితో తాళి కట్టించాను బాబూ! దీని కర్మ చెయ్యాలి. ధారాళాంగా వెయ్యండి." కళ్ళు తుడుచుకున్నాడు ఆ ముసిలాయన. రంగనాథరావు నిశ్చేష్టుడయ్యాడు ఆ విషయం విని.

"అరే! ఎలా చనిపోయింది?"

"ఏవుంది బాబు - ఓ డబ్బున్నాడు నా కాబోయే అల్లుడ్ని గద్దలా తన్నుకుపోయాడు. వాడితోనే నే సంపాదించిదంతా పోయింది. నేను డ్రాయింగ్ మాష్టర్‌గా రిటైర్ అయి తీసుకున్న గ్రాట్యుటి... ఇలా అడుక్కుని సంపాదించిన డబ్బు అన్నీ పోయాయి. అది తట్టుకోలేక నా రాధ ఆత్మహత్య చేసుకుంది." అతను ఏడుస్తూ చెప్పాడు.

రంగనాథరావు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. "నిన్ను మోసం చేసిన వాడి పేరేంటి?" తడారిపోతున్న గొంతుతో అడిగాడు.

"రామ్మూర్తి!" థూ అని ఉమ్మేశాడు అతనుచెబుతూ.

(స్వాతి మాస పత్రిక)

